సాక్షి
కర్నూలు
సోమవారం, 24, జూలై, 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరుకు చెందిన ఎం. రామమోహన్‌రావు రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: ఆదివారం సెలవురోజు కావడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. స్థానిక కోనేరులలో స్నానాలు ఆచరించిన స్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు.



దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల రుద్రాభిషేకం, కుంకుమార్చన చేపట్టారు.

న్యూస్‌రీల్

పాఠశాలల్లో డ్రాపౌట్లు ఉండకూడదు

- డీఈఓ రంగారెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్/గోనెగండ్ల: ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్లు లేకుండా ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారం తీసుకొని డ్రాప్‌అవుట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను డీఈఓ పరిశీలించారు. ఎంఈఓలు ఆంజినేయులు, మధుసూదన్‌రాజు, జిల్లా ఉర్దూ స్కూళ్ల డీఐ ఆదాంబాషా పాల్గొన్నారు.

మహిళకు వజ్రం లభ్యం!

తుగ్గలి: మండల పరిధిలోని జీ ఎర్రగుడిలో ఆదివారం ఆముదం పొలంలో కలుపు తీస్తుండగా ఓ మహిళకు వజ్రం లభ్యమైనట్లు సమాచారం. టెండరులో విక్రయించేందుకు ఈ వజ్రాన్ని పెట్టగా బేరం కుదరలేదని తెలిసింది.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

19 మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలోని 19 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కల్లూరులో 9.2, గూడూరులో 7.8, కర్నూలు రూరల్‌లో 7.8, పెద్దకడుబూరులో 7.4, కర్నూలు అర్బన్‌లో 7.4, సీ.బెళగల్‌లో 7.2 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా ఇప్పటి వరకు 68.3 మి.మీ. నమోదైంది.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న ప్రధాన క్యూ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం ఆదివారం సెలవు నేపథ్యంలో భక్తులతో కిటకిటలాడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. అలాగే పాతాళగంగ పుణ్యస్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శనానికి తరలిరావడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 42మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేశారు. వీరిలో నలుగురు ఏఈఓలతో పాటు 13మంది పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు ఉన్నారు. దేవస్థాన పారిశుద్ధ్య నిర్వాహకులకు ఏఈఓగా ఉన్న ఫణిధరప్రసాద్‌ను రెవెన్యూ సెక్షన్‌కు బదిలీ చేశారు.



ఈ మహిళ పేరు పి. శ్రావణి. గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామ వాసి. గర్భిణిగా ఉన్న సమయంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా గ్రామంలోని హెల్త్‌క్లినిక్‌కు వెళ్లేవారు. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేవారు. ఎలాంటి ఆరోగ్య సమస్య లేకుండా ఈమె బిడ్డకు జన్మనిచ్చారు. గతంలో ఎలాంటి వైద్యం కోసమైనా గోనెగండ్ల, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఊర్లోనే ఉత్తమ వైద్యం అందుతోందని ఈమె తెలిపారు.



ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు లక్ష్మీదేవి. ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలో నివాసం ఉంటున్న ఈమె బీపీ, షుగర్ వైద్య పరీక్షల కోసం డబ్బు ఖర్చు పెట్టుకుని ఆదోని వెళ్లేవారు. ప్రస్తుతం గ్రామంలోనే హెల్త్ క్లినిక్ ఏర్పాటు కావడంతో కష్టాలు తప్పాయి. పెద్దతుంబళం డాక్టర్ నీలోఫర్ గ్రామానికి వచ్చిన చికిత్స చేస్తున్నారని ఈమె తెలిపారు. ఎంపీహెచ్ఓ లక్ష్మినారాయణ, ఆశావర్కర్లు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్న ఊర్లోనే వైద్యం అందుతుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



పల్లెకు ఆరోగ్య భాగ్యం

- ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- ఉన్న ఊళ్లోనే ఉత్తమ వైద్యం
- రోగమొస్తే పట్టణానికి పోవాల్సిన అవసరం లేదు
- వైద్యం చేస్తున్న బీఎస్సీ నర్సులు
- పీహెచ్‌సీ వైద్యులతో టెలీమెడిసిన్ సేవలు

దగ్గొచ్చినా..జ్వరమొచ్చినా పట్టణం వెళ్లాల్సిన అవసరం లేదు. పదుల కిలోమీటర్లు ప్రయాణించి, వందల రూపాయలు ఖర్చు పెట్టుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితీ తొలగిపోయింది. ఒళ్లు నొప్పులకు..బీపీ, షుగర్‌లకు ఉన్న ఊర్లోనే ఉత్తమ వైద్యం అందుబాటులోకి వచ్చింది. రక్త, మూత్ర, మలేరియా తదితర పరీక్షలు ఉచితంగా చేయించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పల్లె ప్రజలకు ఆరోగ్య భాగ్యం లభించింది.



చిన్నారికి టీకా వేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ



కల్లుదేవకుంట హెల్త్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 50కి పైగా అర్బన్‌హెల్త్ సెంటర్లు, మూడు ఏరియా ఆసుపత్రులు, కర్నూలు, నంద్యాలలో బోధనాసుపత్రులు ఉన్నాయి. గతంలో ప్రజలకు ఏదైనా జబ్బు చేస్తే ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేవారు. సాధారణ వ్యాధులైతే అక్కడే చికిత్స చేస్తారు. ఒకవేళ రోగికి వచ్చిన వ్యాధి అర్థం కకపోతే సదరు రోగిని సీహెచ్‌సీ లేదా ఏరియా ఆసుపత్రి, జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రికి పంపిస్తారు. అప్పట్లో ఊళ్లో ఉండే సబ్‌సెంటర్ల పరిస్థితి దారుణంగా ఉండేది. చాలా వరకు కేంద్రాలకు సొంత భవనాలు ఉండేవి కావు. దీంతో పూరి పాకల్లో, చిన్న దుకాణాల్లో వాటిని ఏర్పాటు చేసి అద్దె చెల్లించేవారు. ఆ అద్దెలు కూడా సరిగ్గా ప్రభుత్వం చెల్లించేది కాదు. ఏఎన్ఎంలే తమ ఉద్యోగాన్ని కాపాడుకోవడానికి ప్రతి నెలా సబ్‌సెంటర్ అద్దె చెల్లించే పరిస్థితి ఉండేది. ఏఎన్ఎంల వద్ద సాధారణ జబ్బులకు మాత్రమే కొన్ని మందులు ఉండేవి. దీంతో రోగులను అధిక శాతం వారు ఏఎన్ఎంలు పీహెచ్‌సీలకే పంపించేవారు. ఆయా కేంద్రాల నుంచి చాలామంది కర్నూలు, ఆదోనిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చేవారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు తప్పనిసరిగా జిల్లా కేంద్రంలోనే వైద్యం చేయించుకోవాల్సిందే. ఇప్పుడా పరిస్థితి మారింది. ఉన్న ఊళ్లోనే వైద్యం అందుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ఆధునిక సౌకర్యాలు మరింత ఊతమిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు గ్రామాల్లో పనిచేస్తున్నాయి. అవసరమైతే రోగి ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నారు. పెద్ద వ్యాధిగా అనుమానం వస్తే జిల్లా కేంద్రంలోని వైద్యులకు ఫోన్ చేసి టెలిమెడిసిన్ ద్వారా వైద్యులను సంప్రదించి మందులు ఇస్తున్నారు.

ఉత్తమ వైద్యసేవలు

గ్రామాల్లో సబ్‌సెంటర్‌ల స్థానంలో ఏర్పాటైన వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లలో పీహెచ్‌సీ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయి. హెల్త్ క్లినిక్‌లలో 67 రకాల వైద్యపరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఇందులో ప్రత్యేక శిక్షణ పొందిన బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన వారు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విశేష సేవలందిస్తున్నారు. అందుకే వీరిని మిని పీహెచ్‌సీలుగా అభివర్ణిస్తున్నారు. ఈ కేంద్రానికి వచ్చిన రోగులకు సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్‌లకు సైతం వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు కూడా అందిస్తున్నారు. రోగికి వచ్చిన జబ్బు గురించి ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీ లేదంటే జిల్లా కేంద్రంలోని టెలిమెడిసిన్ సెంటర్‌లోని వైద్యులకు ఫోన్ చేసి రోగులతో మాట్లాడించి చికిత్స చేయిస్తున్నారు. దీనివల్ల రోగులు సుదూర ప్రాంతాల్లోని ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే అవసరం తప్పుతోంది. వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లలోనే సాధారణ కాన్పులు చేసేందుకు సైతం ఏర్పాట్లు చేశారు.

హెల్త్ క్లినిక్‌లలో అందే ప్రాథమిక పరీక్షలు ఇవీ...

హిమోగ్లోబిన్, గర్భిణులకు యూరిన్ పరీక్ష, ఇతర యూరిన్ టెస్టులు, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, కంటి పరీక్షలు, అయోడిన్ సాల్ట్ పరీక్షలు, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి, ఫైలేరియా, ర్యాపిడ్ టెస్ట్, కఫం పరీక్షలు.



ప్రాథమిక వైద్య సదుపాయాలు..

- గర్భిణులకు, చిన్నారుల సంరక్షణకు అవసరమైన వైద్య సేవలు
- నవజాత శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు
- బాల్యం, కౌమార దశ ఆరోగ్య సంరక్షణ సేవలు
- కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక సేవలు, ఇతర పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ సేవలు
- అంటు వ్యాధుల నిర్వహణ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు
- తీవ్రమైన సాధారణ అనారోగ్యాలు, చిన్న జబ్బులకు జనరల్ అవుట్ పేషెంట్ కేర్
- అసాంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ, నిర్వహణ
- సాధారణ ఆప్తాల్మిక్ (కంటి సమస్యలు), ఈఎన్‌టీ సమస్యల కోసం జాగ్రత్తలు
- ప్రాథమిక నోటి ఆరోగ్య సంరక్షణ
- వృద్ధాప్య వ్యాధులకు చికిత్స, ఉపశమన ఆరోగ్య సంరక్షణ సేవలు
- కాలిన గాయాలకు, ప్రమాదాల్లో గాయపడిన (ట్రామా) వారికి అత్యవసర వైద్య సేవలు

జిల్లాలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	425
రోగులకు చేసే వైద్య సేవల రకాలు	12
క్లినిక్‌ల్లో వైద్య పరీక్షల రకాలు	14
అందుబాటులో ఉన్న మందుల రకాలు	105

సగటున రోజు ఒక్కో క్లినిక్‌లో

ఓపీలు	40 - 40
వైద్య పరీక్షలు	15 - 20
టెలీ కన్సల్టెన్సీలు	4 - 7

చిన్నారులతో పాటు గర్భిణులకూ వైద్యం



గ్రామంలో ఉన్న చిన్నారులతోపాటు గర్భిణులకూ వైద్య సేవలు అందిస్తున్నాం. వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం. వ్యక్తిగత పరిశుభ్రతపై, గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపంపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించడం ఎంతో ఆనందంగా ఉంది.
– ఎస్. వినోద్‌కుమార్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్, కలుదేవకుంట్ల పీహెచ్‌సీ

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



గతంలో వైద్యం కోసం చాలా మంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, సీహెచ్‌సీలకు, జిల్లా కేంద్రానికో వెళ్లేవారు. ఇప్పుడు పీహెచ్‌సీ కేంద్రాల్లో అందే సేవలన్నీ దాదాపుగా పల్లెల్లో ఉన్న వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుతున్నాయి. సాధారణ జబ్బులకు చికిత్సతో పాటు బీపీ, షుగర్ జబ్బులకు కూడా మందులు ఇస్తున్నారు. ఊళ్లోనే అన్ని రకాల చికిత్సలు చేయడం వల్ల పీహెచ్‌సీలపై భారం తగ్గింది. ప్రజలకు కూడా వ్యయప్రయాసలు తగ్గాయి. ప్రజలు ఇలాంటి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి.
–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

రెండో అయోధ్యగా మంత్రాలయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

మంత్రాలయం రూరల్: దేశంలో రెండో అయోధ్యగా మంత్రాలయం నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, జై శ్రీరామ్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.250 కోట్లతో చేపట్టే 108 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహ నిర్మాణానికి ఆదివారం మంత్రాలయంలో భూమి పూజ చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులను ఎలా గౌరవించాలో, ఎలాంటి పరిపాలన అందించాలో మనవాళికి శ్రీరాముడు చూపారన్నారు. శ్రీరాముడి విగ్రహం ఏర్పాటైతే దేశంలో మంత్రాలయం ప్రముఖంగా నిలుస్తుందన్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మాట్లాడుతూ.. శ్రీరాముడు నడియాడిన క్షేత్రం మంత్రాలయమన్నారు. ఆయన విశ్రాంతి తీసుకున్న బండరాయితోనే రాఘవేంద్రస్వామి వారు తన బృందావనాన్ని చేయించుకున్నారని పేర్కొన్నారు. మంత్రాలయంలో శ్రీరాముడి విగ్రహ ఏర్పాటు ప్రపంచానికే ప్రత్యేకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. శ్రీరాముడి విగ్రహాన్ని మంత్రాలయంలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు వై.ప్రదీప్‌రెడ్డి,, శ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీ శ్రీధర్, కె.రాములు, మంత్రాలయం సర్పంచ్ భీమయ్య, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ నిర్వహిస్తున్న పీఠాధిపతి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, మంత్రి గుమ్మనూరు జయరాం తదితరులు

తుంగభద్ర డ్యాంకు పెరుగుతున్న వరద

- 59 వేల క్యూసెక్కుల నీరు చేరిక
- 27 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- నెలాఖరికి ఎల్లెల్సీకి నీటి విడుదల



వరద నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర డ్యామ్

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. మొత్తం 59,500 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తి నీటి మట్టం 1633 అడుగుల కాగా ఆదివారం సాయంత్రానికి 1600 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 105.788 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను 27 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న శివమొగ్గ, శృంగేరి, చిక్కమంగళూరు, వరనాడు, మలేనాడు, కొడుగు, ఆగుంబే తదితర ప్రాంతాలతో పాటు తుంగభద్ర రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలో కురుస్తున్న భారీ వర్షాలతో టీబీ డ్యామ్‌లోకి వరద పోటెత్తుతోంది. రెండు రోజుల్లో దాదాపు 8 టీఎంసీలకు పైగా నీరు డ్యామ్‌లోకి వచ్చి చేరింది. మూడు రోజులు నుంచి అనూహ్యంగా ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తుండడంతో రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే ఈ నెలాఖరికి డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి గేట్లు ఎత్తే పరిస్థితి కనబడుతోంది.

28 తర్వాత ఎల్లెల్సీకి నీటి విడుదల!

తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు ఈ నెల 28 తర్వాత టీబీ బోర్డు అధికారులు నీటిని విడుదల చేయనున్నట్లు సమాచారం. జలాశయంలో 50 టీఎంసీల వరకు నీరు చేరితే గేట్లు ఎత్తుతారు. అయితే చెరువుల్లో నీరు లేక ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ఎల్లెల్సీకి ముందుగానే నీటిని విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

శ్రీశైలానికి ప్రారంభమైన వరద ప్రవాహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయానికి ఆదివారం నుంచి వరద ప్రవాహం మొదలైంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టారు. ఉత్పాదన అనంతరం జలాశయానికి ఆదివారం ఉదయం నుంచి వరద ప్రవాహం మొదలైంది. ఆదివారం సాయంత్రం సమయానికి జూరాల నుంచి శ్రీశైలానికి 37,930 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 33.7658 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యామ్ నీటిమట్టం 809.10 అడుగులుగా నమోదైంది.



మట్టి మనిషి గట్టి సంకల్పం

వాన వస్తే సంబరం.. మొలక మొలిస్తే సంతోషం.. పైరు ఏపుగా పెరిగితే పట్టరాని ఆనందం.. వ్యవసాయంలో ప్రతి అంశమూ రైతుకు పండుగే! కష్టాన్ని ఇష్టంగా భరించడం.. బీడు భూముల్లో సైతం సస్యాలు పండించడం.. మట్టిని ప్రేమించి.. అందులోనే జీవితాన్ని వెతుక్కోవడం అన్నదాతకే సొంతం. మట్టితో మమేకమై.. పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న ఈ దృశ్యం ఆదివారం నందవరం మండలంలో కనిపించింది. మట్టి మనిషి గట్టి సంకల్పానికి ఈ దృశ్యం అద్దం పట్టింది.
– నందవరం



కృష్ణమ్మకు వాయనం సమర్పిస్తున్న దృశ్యం

మహా ఘట్టానికి 60 ఏళ్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలండ్యామ్ నిర్మాణానికి పునాది వేసి సరిగ్గా ఆదివారం నాటికి 60 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణానికి కీలక భూమిక పోషించిన స్వర్గీయ నీలం సంజీవరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులు అర్పించారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వైద్యశాల శిలాఫలకానికి కూడా పూజలు చేశారు. అనంతరం శ్రీశైలం డ్యామ్ వద్దకు చేరుకుని శాస్త్రోక్తంగా వేదపండితులచే కృష్ణానదికి హారతి ఇచ్చి వాయనం సమర్పించారు. కార్యక్రమంలో స్పోసా కార్యనిర్వాహకులు హరినాథ్‌బాబు, చంద్రశేఖర్, వేణుగోపాల్, వట్టి వెంకటరెడ్డి, నాగరాజు, సూరిబాబు, రిటైర్డ్ ఉద్యోగులు కత్తుల కోటేశ్వరరావు, కృష్ణయ్య, శాంతి లత, తదితరులు పాల్గొన్నారు.

వెలుగులు నింపిన ప్రాజెక్ట్

దాదాపు ఆరు దశాబ్దాల క్రితం అంధకారంలో ఉన్న పల్లెలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో విద్యుత్ ఉత్పాదన కోసం కృష్ణానదిపై నిర్మించిన శ్రీశైలం డ్యామ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో వెలుగులు నింపుతోంది. ఈ డ్యామ్ నిర్మాణానికి నాటి ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ, నాటి ముఖ్యమంత్రి దివంగత నీలం సంజీవరెడ్డిలు 1963 జూలై 23న శంకుస్థాపన చేశారు. విద్యుత్ ఉత్పాదన ప్రధాన ధ్యేయంగా ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించినా అనంతరం సాగు, తాగునీటి వనరుగా మారింది. 308 టీఎంసీల నీటి నిల్వ ఉండేలా ఈ ఆనకట్టను నిర్మించారు. కుడిగట్టు, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలను డ్యామ్ నిర్మాణం అనంతరం నిర్మించారు. డ్యామ్ నిర్మించి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఇంజినీర్లు, పూర్వ విద్యార్థులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు.

క్లుప్తంగా

నకిలీ వెబ్‌సైట్‌తో ఉద్యోగాలంటూ మోసం

కర్నూలు(అగ్రికల్చర్): ఫసల్ బీమా అసిస్టెంటు ఉద్యోగాలను మండలాల వారీగా కల్పిస్తున్న భారతీయ కో–ఆపరేటివ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ పేరుతో పేరుతో ఇచ్చిన నోటిఫికేషన్ నకిలీదని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వర లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజులుగా ఫసల్ బీమా అసిస్టెంటు ఉద్యోగాలు అంటూ ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. నిరుద్యోగులను దగా చేసి సొమ్ములు కొల్లగొట్టేందుకు కో–ఆపరేటివ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ పేరుతో ఫేక్ వెబ్‌సైట్ క్రియేట్ అయిందని, దీనిని ఎవ్వరు నమ్మవద్దని సూచించారు. భారతీయ కో–ఆపరేటివ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్‌పై ఢిల్లీలో క్రిమినల్ కేసు నమోదు అయిందన్నారు.

'జంగమ' సంఘం నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు(అర్బన్): జిల్లా జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులుగా విశ్వేశ్వరయ్య స్వామి, ప్రధాన కార్యదర్శిగా బసవరాజుస్వామి, కోశాధికారిగా శంకర్‌స్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు విశ్వేశ్వరయ్య స్వామి మాట్లాడుతూ.. జిల్లాలోని జంగమ సభ్యుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రాజకీయంగా జంగమ కులస్తులు వెనుకపడ్డారని, ప్రధాన రాజకీయ పార్టీలు జంగమ కులాన్ని గుర్తించి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉప్పరలను బీసీ–ఏ లో చేర్చాలి



జిల్లా భగీరథ సగర ఉప్పర సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: ఉప్పర కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చి వారి అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా భగీరథ సగర ఉప్పర సంఘానికి కొత్తగా ఎంపికైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెర్నేకల్ బి.సత్యన్న, బసరకోడు వీరేంద్ర కోరారు. ఆదివారం స్థానిక ఉప్పర కళ్యాణ మండపంలో జిల్లా భగీరథ సగర ఉప్పర సంఘ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. కొత్తగా ఎంపికైన వారిని సన్మానించిన అనంతరం మాజీ జిల్లా అధ్యక్షుడు రాముడు అధ్యక్షతన జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో భగీరథ మహర్షి విగ్రహాలను ఏర్పాటు చేసి, భగీరథ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారిగా ఎన్నికైన యుకె వినయ్‌కుమార్, సంఘ సీనియర్ నాయకులు ఏపీ ఈరన్న, యుకె రాజశేఖర్, యుయు నాగేష్,గిడ్డయ్య, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుకు అనుకూలం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా పడుతున్నందున ఈ నెల చివరి వరకు దాదాపు అన్ని పంటలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎర్ర, నల్ల నేలల్లో సెప్టెంబరు నెల వరకు ఏఏ పంటలు వేసుకోవచ్చనే దానిపై వారు స్పష్టత ఇచ్చారు. నల్లరేగడి నేలల్లో ఈ నెల చివరి వరకు పత్తి, కంది, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, కొర్ర, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చు. ఆగస్టులో పత్తి, కంది, ప్రొద్దు తిరుగుడు, కొర్ర, మొక్కజొన్న వేసుకోవచ్చు. అయితే పత్తి, మొక్కజొన్న పంటలను ఆగస్టు మొదటి వారం వరకే వేసుకోవాలి. సెప్టెంబరులో కంది, ప్రొద్దుతిరుగుడు, జొన్న, కొర్ర,పొగాకు పంటలు సాగు చేసుకోవచ్చు. ఎర్ర నేలల్లో ఈ నెల చివరి వరకు పత్తి, కంది, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, అలసంద సాగు చేసుకోవచ్చు. ఆగస్టులో కంది,ప్రొద్దుతిరుగుడు, సజ్జ, పెసర, అలసంద పంటలు వేసుకోవచ్చు. ఆగష్టు 15 నుంచి ఉలువ కూడా సాగు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సెబ్‌కు సొంత భవనాలు

- జిల్లాలో ఏడు సెబ్ భవనాలు
- తీరనున్న కార్యాలయాల సమస్య
- తొలగనున్న అద్దె కష్టాలు
- స్థలాలు కేటాయించిన రెవెన్యూ యంత్రాంగం



కోడుమూరులో ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలోని ఓ భవనంలో నడుస్తున్న సెబ్ కార్యాలయం

కోడుమూరు: అక్రమ మద్యాన్ని, గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలను, అక్రమ రవాణాను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్న స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)కు ప్రభుత్వం సొంత భవనాలను నిర్మిస్తోంది. కర్నూలు జిల్లాలో ఉన్న సెబ్ కార్యాలయాలన్నింటికీ అన్ని వసతులతో కూడిన సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించుకుంది. స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఇవీ కష్టాలు..

సెబ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు బాత్‌రూంలు, నీటి వసతిలేని అద్దె భవనాల్లో తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. పట్టుబడిన వాహనాలు నిలుపుకునేందుకు స్థలాల్లేక బయలు ప్రాంతంలోనే వాహనాలను పెట్టేవారు. పట్టుబడిన వాహనాలు ఎండకు, వానకు తడిసి పాడైపోయేవి. ఇలాంటి సమస్యల నుంచి సెబ్ సిబ్బందికి విముక్తి కలుగుతోంది. ప్రభుత్వం నిర్ణయంతో సెబ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. అ

జిల్లాలో ఏడు స్టేషన్‌లకు సొంత భవనాలు

కర్నూలు జిల్లాలో ఏడు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్లు ఉన్నాయి. ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో సెబ్ స్టేషన్‌లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కోడుమూరు, కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు మండల కేంద్రాల్లో సెబ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌కు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ప్రభుత్వమే అద్దెలు చెల్లిస్తోంది. అద్దె భవనాలు కావడంతో అరకొర వసతుల్లోనే అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి వచ్చేది. అక్రమ మద్యం, మత్తు పదార్థాల రవాణా సమయాల్లో దాడులు జరిపితే ఆ సమయంలో పట్టుబడిన వాహనాలు, మత్తుపదార్థాలు వంటివి స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరుపరిచే వరకు భద్రంగా ఉంచేందుకు వసతుల్లేని అద్దె భవనాల్లో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చేది.

20 సెంట్ల స్థలంలో సొంత భవనం

సెబ్ కార్యాలయానికి సొంత భవన నిర్మాణం కోసం కనీసం 20 సెంట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు స్థలాలు చూపాలని ఆదేశాలిచ్చింది. కేటాయించిన స్థలంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, సిబ్బంది విధులు నిర్వహించేందుకు రూంలు, పట్టుబడిన అక్రమ మద్యం, వాహనాలను భద్రపరిచేందుకు స్టోర్‌రూంల వంటి సదుపాయాల కోసం 20 సెంట్ల స్థలం అవసరమని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రెవెన్యూ అధికారులు జిల్లాలోని అన్ని సెబ్ స్టేషన్ల ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

స్థలాన్ని కేటాయించాం

కోడుమూరు సెబ్ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలంటూ దరఖాస్తు చేశారు. సెబ్ అధికారుల విన్నపం మేరకు 180/18 సర్వే నంబర్‌లో 20సెంట్ల స్థలాన్ని కేటాయించాం. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాల నివేదికను కూడా సెబ్ అధికారులకు ఇచ్చాం.

– జయన్న, తహసీల్దార్, కోడుమూరు

ఆత్మస్థైర్యమే ఆయుధం



తనకు వైకల్యం ఉందని ఆ యువకుడు ఎప్పుడూ నిరుత్సాహ పడలేదు. ఆత్మస్థైర్యమే ఆయుధంగా ముందుకు కదులుతున్నాడు. జాఫ్లాతండాకు చెందిన రమావత్ లక్ష్మానాయక్ చిన్నప్పుడు చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. కుడి చెయ్యి విగిరిగి చికిత్స వికటించడంతో మో చేతి వరకు తొలగించారు. ఒక చెయ్యి లేకపోయినా అధైర్యపడకుండా ముందుకు సాగుతున్నాడు. డిగ్రీ మధ్యలో మానేసిన లక్ష్మానాయక్.. తండాలో వలంటీర్‌గా పని చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఎవరిపై ఆధార పడకుండా ఒంటి చేత్తో స్కూటీ నడుపుతూ వలంటీర్ విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. కుడికాలు కింద ఏర్పాటు చేసుకున్న ఎక్సలేటర్ సాయంతో చాకచక్యంగా వాహనాన్ని నడుపుతున్నాడు.

– తుగ్గలి

'పంచాయతీ' ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జీఎన్‌ఏ ప్రసాద్



నూతన అధ్యక్షుడు జీఎన్‌ఏ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) ఏఓ, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎన్‌ఏ ప్రసాద్ చెప్పారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అధ్యక్షులుగా వై శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులుగా జీఎన్‌ఏ ప్రసాద్, కార్యదర్శిగా బీ వీరేష్, అసోసియేట్ అధ్యక్షులుగా ఆర్ తిమ్మప్ప, కోశాధికారిగా ఎల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్ గంగాధర్, ఎస్ గీతాప్రతిమ, సంయుక్త కార్యదర్శులుగా కే శిరీషరాణి, వి చంద్రకాంత్‌రెడ్డి, సీ శివకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మారుతీప్రసాద్, సాయి తేజ, సాయి ఎన్నికయ్యారు. అలాగే అసోసియేషన్ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జీఎన్‌ఏ ప్రసాద్ మాట్లాడుతూ ... నూతనంగా ఎన్నికైన కార్యవర్గం క్రమశిక్షణతో పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సహచర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

– కేసు నమోదు చేసిన పోలీసులు



మృతి చెందిన షేక్ సమీనా

కర్నూలు (టౌన్): నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం అనుమానాస్పద మృతి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఉస్మానియా కళాశాల ఎదురుగా ఉన్న అక్బర్ సాబ్ మసీద్ దగ్గర షేక్ హుస్సేన్ సాహెబ్ కుటుంబం నివసిస్తుంది. తోపుడు బండి మీద గాజులు అమ్ముకునే ఇతనికి ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమార్తె షేక్ సమీనా (21) కు ఏడాదిన్నర క్రితం స్థానిక ఎన్‌టీఆర్ బిల్డింగ్‌లో ఉన్న షేక్ అబ్దుల్ షుకూర్ కుమారుడు షేక్ మహమ్మద్ బాషాకు ఇచ్చి వివాహం చేశారు. ఉన్నట్టుండి ఈనెల 21 వ తేదీ ఉదయం 10.30 గంటలకు సమీనాకు సీరియస్‌గా ఉందని అల్లుడు ఫోన్ చేసి మామకు చెప్పాడు. తర్వాత ఆమెను అమృత ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈనెల 22 వ తేదీ రాత్రి 8.30 గంటలకు సమీనా మృతిచెందింది. కాగా కుమార్తె కుడి కాలు మోకాలికి గాయాలుండటంతో మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేద బ్రాహ్మణులకు అండగా నిలుద్దాం

- దేవదాయ ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్



ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర నూతన కమిటీని ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

కర్నూలు కల్చరల్: పేద బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలుద్దామని దేవదాయ ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర నూతన కమిటీ, 13 జిల్లాల నూతన కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నంద్యాల చెక్ పోస్ట్‌లోని దేవీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నూతన కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షుడిగా వెల్లాలా మధుసూదన శర్మ, ప్రధాన కార్యదర్శిగా పోతావజ్ఝుల పురుషోత్తమ శర్మ, కోశాధికారిగా కొత్తా సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా సండేల్ చంద్రశేఖర్, కార్యదర్శిగా కంచుగంటల శ్యామ్‌సుందర్‌రావు, గౌరవ సలహాదారుడిగా కోలుకుల చంద్రశేఖర్‌రావు, అర్చక విభాగం అధ్యక్షుడిగా కలసపాటి లక్ష్మీనారాయణ, ఉపకార్యదర్శిగా మామిళ్లపల్లి అయ్యప్పశర్మ, మహిళా విభాగం అధ్యక్షురాలుగా శైలజ, రాష్ట్ర కార్యదర్శి కౌసల్య ప్రచార విభాగం అధ్యక్షుడిగా కొల్లు రవికిరణ్, యువజన విభాగం కార్యదర్శి పసుపులేటి శంకర్, బ్రాహ్మణ అన్యాక్రాంత ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్ సముద్రాల హనుమంతరావులతో పాటు 13 జిల్లాల నూతన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదోని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు మనోజ్‌కుమార్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగులవరం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, కోశాధికారి రాధాకృష్ణ, ఉపకార్యదర్శి శ్రీనివాసరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ప్యాలకుర్తి వాసి ఐపీఎస్

- 2022 బ్యాచ్ యూపీఎస్సీలో 189వ ర్యాంక్
- 31 నుంచి ముస్సోరిలో శిక్షణ
- ర్యాంకర్ తండ్రి అబ్దుల్ ఖాదర్ ట్రాన్స్‌కోలో ఏడీఈ

కర్నూలు(రాజ్‌విహార్): సివిల్స్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామ వాసి డాక్టర్ షేక్ హబీబుల్లాకు ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) ఖరారు అయింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సంస్థ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తుది జాబితా విడుదల చేసింది. 2022 నోటిఫికేషన్ ద్వారా నిర్వహించిన సివిల్స్ పరీక్షల్లో హబీబుల్లాకు జనరల్ కేటగిరీలో ఆల్ ఇండియా లెవల్‌లో 189వ ర్యాంకు వచ్చింది. ఇతని తండ్రి షేక్ అబ్దుల్ ఖాదర్ ప్రస్తుతం విద్యుత్ శాఖ (ట్రాన్స్‌కో)లో సూర్యాపేట ఏడీఈగా విధులు నిర్వహిస్తుండగా తల్లి షేక్ గౌసియా బేగం గృహిణి. తాత షేక్ మహబూబ్ దౌల ప్యాలకుర్తి పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. సివిల్స్ ర్యాంకర్ షేక్ హబీబుల్లా 2010లో 10వ తరగతిలో 559 మార్కులు, 2012లో ఇంటర్‌లో 935 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. హైదరాబాద్‌లోని హైదరాబాద్ వెటర్నరీ కళాశాలలో 2019లో వెటర్నరీ డిగ్రీ పూర్తి చేశాడు. తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. తొలి ప్రయత్నం అనంతరం 2021లో ఢిల్లీ వెళ్లారు. అక్కడ జామియా మిలియా యూనివర్సిటీలో శిక్షణ తీసుకుని రెండోసారి సివిల్స్ పరీక్ష రాయగా ర్యాంక్ రాలేదు. మూడో ప్రయత్నంలో 189వ ర్యాంకు సాధించాడు.

సేవ చేయాలని లక్ష్యం



'సివిల్స్ ప్రిపేర్ సమయంలో ఐపీఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. తొలి రెండు సార్లు విఫలమైనప్పటికీ మూడో ప్రయత్నంలో అనుకున్నది సాధించాను. ఐపీఎస్‌లో లా అండ్ ఆర్డర్, కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేవి ముఖ్యమైనవి. ఈ నెల 31 తేదీ నుంచి ఉత్తరఖండ్ రాష్ట్రంలోని ముస్సోరిలో శిక్షణ ప్రారంభమవుతుంది. నవంబరు నుంచి హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీలో శిక్షణ ఇస్తారు. మా గ్రామం నుంచి ఐపీఎస్‌కు ఎంపికైన మొదటి వ్యక్తిని నేను కావడం ఆనందంగా ఉంది. ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఆశయం.

– షేక్ హబీబుల్లా

వైద్యులు, ప్రజలకు అనుసంధాన కర్త మెడికల్ కౌన్సిల్

- వైద్యులు తప్పు చేస్తే నేరుగా కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు
- ఏపీ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ మెంబర్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి



డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వైద్యులకు, ప్రజలకు మధ్యలో ఏ సమస్య వచ్చినా అనుసంధానం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసేదే ఏపీ మెడికల్ కౌన్సిల్ అని ఏపీ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటి మెంబర్, సీటీ సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా మంది మెడికల్ కౌన్సిల్ అంటే అక్కడ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లాగా వైద్యుల పేర్లను రిజిస్టర్ చేసుకుంటారని అనుకుంటారన్నారు. కౌన్సిల్‌కు విస్తృతమైన అధికారాలు ఉన్నాయని, ఒక డాక్టర్‌కు ప్రొఫెషనల్ డెత్ సెంటెన్స్(ప్రాక్టీస్ చేయకుండా ఆపగలిగే) శక్తి కూడా ఉందని తెలిపారు. ఇది ప్రజలు కూడా తెలుసుకోవాల్సిన విషయమన్నారు. ట్రీట్‌మెంట్‌లో వివాదాలు వచ్చినప్పుడు రోగులు న్యాయం కోసం కోర్టులకు వెళ్లడం లేదా కన్జూమర్స్ ఫోరమ్‌ను ఆశ్రయించడం చేస్తుంటారన్నారు. అదే ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తే ఆరు నెలల్లో వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ కౌన్సిల్‌లో ఎథిక్స్ కమిటీ ఉంటుందని, అందులో సభ్యులు కూర్చుని ఆ డాక్టర్ అంశాన్ని పిలిపించి విచారణ చేస్తారన్నారు. ఫిర్యాదులో ఎంత వరకు నిజం ఉంది, నిజంగా అందులో వైద్య సహాయం అందించడంలో తప్పు జరిగిందా లేదా అని ఈ కమిటీ కూలంకుశంగా పరిశీలిస్తుందని చెప్పారు. నిజంగా తప్పు జరిగి ఉంటే సదరు డాక్టర్‌కు శిక్ష విధిస్తారన్నారు. కొన్నిసార్లు జీవితకాలం ప్రాక్టీస్ చేయకుండా బ్యాన్ సైతం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కావున తమకు అన్యాయం జరిగిందని అనుకున్న సమయంలో బాధితులు ఆసుపత్రులపై, డాక్టర్లపై దాడులు చేయకుండా మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. యువ వైద్యులు, ప్రాక్టీస్ చేసే ఇతర వైద్యులు తమ రోగికి చికిత్స చేసే సమయంలో డాక్యుమెంటేషన్ కచ్చితంగా రాయాలన్నారు. చాలా మంది సంతకాలు పెట్టకుండా లేదా కేస్‌షీట్‌లు రాయకుండా ఉంటారన్నారు. వైద్యులంతా నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ అండ్ ఎటిక్వేటిని చదువుకుని దాని ప్రకారం ఫాలో అయితే ఎలాంటి సమస్యలు రావని ఆయన పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస యాదవ్, వై.నారాయణలను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

కర్నూలు సిటీ: ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని ఓ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీనివాసయాదవ్, ప్రధాన కార్యదర్శిగా వై.నారాయణ, ఆర్థిక కార్యదర్శిగా డి.హుస్సేన్‌లను ఎంపిక చేశారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా ఓంకార్ యాదవ్, చంద్రశేఖర్, రమేష్, గౌరవ అధ్యక్షుడిగా వెంకటస్వామి, మహిళ విభాగం ప్రతినిధులుగా విజయమ్మ, వనజాకుమారి, హెడ్ క్వార్టర్ సెక్రటరీగా పి.రామచంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోవిందరెడ్డి, మున్సిపాలిటీ ప్రతినిధిగా వెంకటేశ్వర్లు, కర్నూలు డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా శివరాం, తైమూర్‌బాషాలను ఎన్నుకున్నారు. పత్తికొండ డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా రంగన్న, ఆదోని డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా మధుసూదన్ రాజు, సెక్రటరీగా రమణమూర్తి ఎంపికైనట్లు ఎన్నికల పరిశీలకులు జి.ఓంకార్ యాదవ్ ప్రకటించారు.

చంద్రశేఖర్ కాలనీలో చోరీ

కర్నూలు : నగర శివారులోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న చంద్రశేఖర్ కాలనీలో నివసిస్తున్న యతీంద్ర గౌడ్ ఇంట్లో దొంగలు పడి అందిన కాడికి మూటగట్టుకొని ఉడాయించారు. తల్లి ఆరోగ్యం బాగాలేకుంటే రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి యతీంద్ర గౌడ్ ఆసుపత్రికి వెళ్లాడు. ఇదే అదనుగా బావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి గదిలోని గోద్రెజ్ లాకర్‌లో దాచి ఉంచిన 7 తులాల బంగారు నగలు, 40 గ్రాముల వెండి చోరీ చేశారు. ఆదివారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు యతీంద్ర గౌడ్ ఇంటికి వెళ్లి చూసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మూడో పట్టణ ఎస్‌ఐ చిరంజీవి క్రైమ్ పార్టీ సిబ్బంది ప్రసాద్ సింగ్, చంద్రబాబు నాయుడు, కిషోర్‌తో పాటు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని నేరం జరిగిన తీరును పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానమే పెనుభూతమై..


– టవల్‌తో గొంతు నులిమి భార్యను చంపిన భర్త



భర్త కళ్యాణ్‌తో శిరీష (ఫైల్)

ఆదోనిఅర్బన్ : ఐదేళ్ల క్రితం పెద్దలు నిర్ణయించిన పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు సంతానం. అయితే భార్య శిరీష(23)పై భర్త కళ్యాణ్ అలియాస్ చంటి అనుమానం పెంచుకున్నాడు. అనుమానమే పెనుభూతంగా మారి చివరికి హత్య వరకు దారి తీసింది. వన్‌టౌన్ సీఐ విక్రమ సింహ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కిలిచినపేటకు చెందిన నాగులు, వీరాభాయి కుమారుడు కళ్యాణ్ అలియాస్ చంటి భార్యపై అనుమానం పెంచుకున్నాడు. శనివారం రాత్రి భార్యాభర్తలు తీవ్రంగా గొడవపడ్డారు. ఆదివారం ఉదయం చంటి భార్య శిరీషను టవల్‌తో గొంతుకు ఉరివేసి నులిమి హత్య చేశాడు. వెంటనే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు హత్య చేసిన స్థలానికి వెళ్లి శిరీష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శిరీష తల్లిదండ్రులు నెల్లూరులో చిన్నకొడుకు రోడ్డు ప్రమాదంలో గాయపడగా చూసేందుకు వెళ్లారు. రాత్రి గొడవపడితే బంధువులు సర్ది చెప్పారని, శిరీష తల్లిదండ్రులు ఉండి ఉంటే ఇంత ఘోరం జరిగి ఉండేది కాదని బంధువులు తెలిపారు. శిరీష తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రీశైలంలో పునుగు పిల్లి



ఖాళీ క్యూలో కనిపిస్తున్న పునుగు పిల్లి

శ్రీశైలం: క్షేత్రంలో ఉచిత దర్శన క్యూలో వెళ్లే భక్తులకు శనివారం ఉదయం పునుగు పిల్లి కనిపించింది. భక్తుల సందడితో అక్కడి నుంచి వెళ్లిపోయింది. గతంలో ఆలయ ప్రాంగణం అభివృద్ధి చెందక ముందు కల్యాణ మండపం, నాగులకట్ట, పరిసరాల్లో అనేక పునుగు పిల్లులు కనిపించేవి. అయితే కాల క్రమేణ ఆయా ప్రదేశాల్లో యాగశాల, కల్యాణకట్ట, అన్నపూర్ణదేవాలయం, తదితర అభివృద్ధి పనులు చేపట్టడంతో పునుగు పిల్లుల జాడ కనిపించకుండా పోయింది. చాలా రోజుల తర్వాత పునుగు పిల్లి కనిపించడం శుభసూచికమని స్థానికులు, దేవస్థానం ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

చినుకులే ముత్యాలై!



అలా గట్టిగా కురవదు.. ఇలా విడవనూ విడవదు. గత మూడు రోజులుగా ఇదీ వర్షం తీరు. తుంపర్లు పడుతుండటంతో ఊరంతా చిత్తడిగా మారుతోంది. ఇలా రాలుతున్న వాన చినుకులు చెట్ల ఆకులపై, విద్యుత్ తీగలపై నిలిచి నీటి ముత్యాలై మెరుస్తున్నాయి. శుక్రవారం కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నున్న విద్యుత్ తీగలపై ఇలాంటి దృశ్యమే ఆవిష్కృతమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Paramedical - B.Sc. & Diploma కోర్సులు - Anesthesia, Cardiology, Radiology, M.L.T, O.T. Tech, Emergency, BPT, MPT, Forensic. అర్హత : ఇంటర్. (C) : 95813 84578, 90636 15623 [V. 2028]

DISTANCE DEGREE & PG

■ Degree: B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLISc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLISc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact 90306 28410, 93937 28410 [L-787372]

B.Tech/Free

■ గర్ల్స్ ఇంజనీరింగ్ కాలేజీలో AP EAPCET లో క్వాలిఫైడ్ గర్ల్స్ కి ఫ్రీ ఎడ్యుకేషన్, క్వాలిఫై కాకపోతే ఓన్లీ హాస్టల్ ఫీజుతో B.Tech (ఏదీ బ్రాంచ్) చదివే అవకాశం. సంప్ర: జి. మురళీ, 9030661651, ATP. [A-2588]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1492]

FLAT FOR SALE

■ New Triple Bed Room Flats For Sale, Total 15 Flats, Beside Railway Station, Narasimha Reddy Nagar, Kurnool For details. Contact: 91114 34445, 98490 38268 [L-787223]

■ వర్షిరెడ్డి బ్లూమ్ గార్డెన్ కుడా (KUDA) అప్రూవ్ లేఔట్, 100% వాస్తు, ఈస్ట్ వెస్ట్ ఫేసింగ్, 3-6 సెంట్లు ప్లాట్స్, లేఔట్‌కి తూర్పున ప్యాపిలి ఊరిలోకి వెళ్లే ఓల్డ్ హైవే పడమర NH-44 హైవే, కస్తూర్బా హైస్కూల్ ఎదురుగా ప్యాపిలి. 9845983688, 7207334543. [A-1003]

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) ప్లాటు కేవలం 3 లక్షలు మాత్రమే. EMI సౌకర్యం కలదు. సంప్ర: నితిక డెవలపర్స్, 98884 24222 [L-787373]

SERVICES

HAPY CARS

■ మీకు కారు ఉందా? కారుని ఎందుకు ఇంట్లో నిలబెట్టాలి. Hapy Car ఇప్పుడు కర్నూలు నగరంలో ఉంది. Hapy Car తో మీ కారుని జోడించి నెలకు 32,000/- వరకు సంపాదించడం ప్రారంభించండి మరింత సమాచారం కోసం 6301174565, 7893887729 కాల్ చేయ్యండి. [C-785912]

WANTED

■ కర్నూలు జిల్లాలో గల ప్రముఖ పాలడైరీలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అర్హత: 10thడిగ్రీ, జీతం: 11 వేల నుండి 14 వేలు. 95817 76924/25 [L-787220]

■ VAN లో వెళ్ళి డోర్ to డోర్ సేల్స్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత: 7th - ఇంటర్ (P/F) జీతం 10 వేలు, ప్రమోషన్‌లో 25 వేలు, ఫ్రీ రూం. సంప్ర: 97019 69594, కర్నూలు [L-787362]

■ HDFC లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కొరకు ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్ (ఇన్సూరెన్స్ ఏజెంట్స్) కావలెను. Q: ఇంటర్/డిగ్రీ. G:M/F A:25 సం॥ల పైన. ఇంటర్వ్యూ: 24-7-23@10.30AM, సంప్ర: 85550 56140 [L-685]

■ మా ఇనోవిజన్ గ్రూప్స్ తరఫున ఈ క్రింద ఇవ్వబడిన సంస్థలలో పనిచేయుటకు ఆసక్తి గల యువతీ, యువకులు కావలెను. (1) కర్నూలు ప్రముఖ హాస్పిటల్స్, సినిమా థియేటర్స్, పాలడైరీ, బనగానపల్లె స్కూలు: సెక్యూరిటీ గార్డ్స్, లేడీ రిసెప్షనిస్ట్, లేడీ వార్డెన్స్ (2) లేడి షాపింగ్ మాల్: స్టోర్ మేనేజర్, ఫ్లోర్ ఇన్‌ఛార్జెస్, (3) ఇన్సూరెన్స్ కంపెనీ: లేడి టెలికాలర్స్ (4) ప్రముఖ హాస్పిటల్: OT లేడి స్టాఫ్, నర్సులు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (5) ప్రముఖ ట్రేడర్స్: డెలివరీ, కలెక్షన్, ఆఫీస్ బాయ్స్, ITI డిప్లొమా క్యాండిడేట్స్ కావలెను. సంప్ర: 95151 30221, 98775 34196, 80088 69176. [L-787224]

■ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేయుటకు అర్జెంటుగా సెక్యూరిటీగార్డ్స్ కావలెను. సాలరీ: 16500/- నంద్యాల. సంప్ర॥ బేతంచేర్ల రైల్వే గేట్. సెల్: 9182851872, 9704514498 [Y-784373]

■ ప్రముఖ గ్లోబల్ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221346]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 72074 45296 [V-6195]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 9848571888 [HA-424]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP& డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA-440]



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.